బీఆర్ఎస్ శ్రేణులు, జర్నలిస్టులపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీజీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

దాడిచేస్తే తిప్పికొడ్తం!

మొదటిపేజీ తరువాయి...

జిల్లాకేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకత్వంలో రైతు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆ ధర్నాలో పెద్ద సంఖ్యలో రైతులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కార్యకర్తలు పాల్గొన్నారని వెల్లడించారు. ధర్నా రోజు జరిగిన అరాచకాలపై డీజీపీ జితేందర్‌కు ఆధారాలతో సహా విన్నవించామని వివరించారు.

పిరికిపంద పాలనకు నిదర్శనం

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో గాదరి కిశోర్ నాయకత్వంలో 500 మందికి పైగా రైతులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే.. 50 మంది కిరాయి మూకలు, కాంగ్రెస్ గూండాలు తాగిన మైకంలో పోలీసులతో కలిసి రైతులు ధర్నా చేస్తున్న శిబిరంపై దాడికి తెగబడ్డారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులు, గుడ్లు, రాళ్లు, చెప్పులు వేసి రైతులను తీవ్రంగా అవమానించారని, హింసాయుత వాతావరణాన్ని సృష్టించారని మండిపడ్డారు. 'మా వాళ్లు తిరగబడితే.. ఆ 50 మంది కాంగ్రెస్ గూండాల్లో ఒక్కడూ మిగిలేవాడు కాదు. ప్రజాస్వామ్యంలో హింస సమాధానం కాదు కాబట్టే మా వాళ్లు గమ్మున ఉన్నారు. ఇందులో దుర్మార్గం ఏంటంటే.. డ్యూటీలో ఉన్న పోలీసులు రైతుల నిరసన శిబిరం టెంట్లు కూల్చివేసి, రాళ్లు రువ్వి.. ఆ గూండాలకు వత్తాసు పలకడం. ఇది రేవంత్‌రెడ్డి అనే ఓ పిరికిపంద పాలనకు నిదర్శనం' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రైతులకు సమాధానం చెప్పలేని దద్దమ్మ

రుణమాఫీ, రైతు భరోసాపై ప్రజల్లోకి పోయి రైతులకు సమాధానం చెప్పలేని దమ్ములేని దద్దమ్మ ఈ సీఎం అని కేటీఆర్ అన్నారు. 'మేము అడిగినం. చేత నైతే రా.. ఏ ఊరికి, ఏ మండలానికి పోదామో చెప్పు అని. నీ నియోజకవర్గం కొడంగల్ పోదామా? నువ్ పుట్టిన ఊరు కొండారెడ్డిపల్లి పోదామా? వస్తవా? అని అడిగా. ఎక్కడికీ రాలేదు. కానీ 20వ సారి ఢిల్లీకి పోయిండు. మన గల్లీలోని ప్రజల సమస్యలు తెలుసుకోకుండా సిగ్గులేకుండా ఢిల్లీకి తొత్తుగా, గులాముగా ఈ సీఎం ఢిల్లీకి పోతుండు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను, కిరాయి గూండాలను అడ్డుపెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, గొంతు నొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

దమ్ముంటే.. చర్చకు రా

'రైతు రుణమాఫీపై నీకు దమ్ముంటే.. సెక్యూరిటీ లేకుండా, పోలీసు బలగాలను అడ్డుపెట్టుకోకుండా రా. బ్యాంకు అధికారులను, వ్యవసాయ అధికారులను వెంటపెట్టుకోకుండా రా. మేము కూడా వస్తం. ఏ ఊరికి పోతవో చెప్పు.. పోదాం' అని సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. ఎక్కడా చారణా రుణమాఫీ కాలేదని, ఈ విషయంలో రైతులు భగభగ మండుతున్నారని, కాంగ్రెస్ వాళ్లు ఊర్లలోకి వస్తే తరిమికొట్టాలని చూస్తున్నారని చెప్పారు. పోలీసులు, అధికారగణాన్ని అడ్డుపెట్టుకొని తప్పులు చేస్తున్నారని అన్నారు.

మహిళా జర్నలిస్టులు బూతులు తిట్టారా?

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళాజర్నలిస్టులపై కాంగ్రెస్ గూండాలు దాష్టికం ప్రదర్శించడంపై కేటీఆర్ మండిపడ్డారు. 'వారు సీఎంను బూతులు తిట్టారా? సీఎం లాగులో తొండలు విడుస్తమన్నారా? చెట్టుకు కట్టేసి కొడ్తమన్నరా? గుడ్లు పీకి గోటీలు ఆడుతమన్నారా? ఏమన్నరు? ఏం తప్పుడు మాటలు మాట్లాడారు? వారు కేవలం సీఎం సొంత ఊరిలో రుణమాఫీ అయిందా? లేదా? అని అడుగుతుంటే.. కాంగ్రెస్ చిల్లరగాళ్లు, గూండాలు ఇద్దరు మహిళా జర్నలిస్టులపై దాడి చేయడమే కాకుండా.. వారిని కొండారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తి వెల్దండి పోలీసు స్టేషన్ వరకు కార్లతో వెంబడించి, బెదిరించి వాళ్లమీదపడి రక్కినంత పనిచేశారు. ఇది సీఎం నికృష్ట మనస్తత్వానికి, కాంగ్రెస్ కార్యకర్తల తీరుకు ఇది నిదర్శనం' అని ధ్వజమెత్తారు. వారిద్దరికీ సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'నీ సొంతూరులో, నీ ఇంటిముందు, నీ పార్టీ.. ఇద్దరు ఆడబిడ్డలను అవమానించింది. వాళ్లు నీ బండారం బయటపెట్టినందుకు.. రుణమాఫీ జరగలేదని ప్రజల్లోకి తీసుకెళ్తున్నందుకు.. నిన్నటి నుంచి నికృష్టమైన రోత పుట్టించే వార్తలు, రాతలతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు' అని దుయ్యబట్టారు.

పోలీసులకు అత్యుత్సాహం మంచిదికాదు

'ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారగణం ఏది చెప్తే అది పోలీసులు చేయాలి. కానీ, మీకొక విజ్ఞప్తి. మీరు అత్యుత్సాహం ప్రదర్శిస్తే మంచిది కాదు. మా పిల్లలు రుణమాఫీ జరగలేదని పోస్టు పెడితే పోలీసులు కాల్ చేస్తున్నారు. కరెంటు పోయిందని కాల్ చేస్తే విద్యుత్తు అధికారులు కాల్ చేస్తున్నారు. ఈ అత్యుత్సాహం వద్దు. సంయమనం పాటించండి. అధికారం ఎవడబ్బ సొత్తు కాదు. ప్రజాస్వామ్యంలో అధికారం మారుతుంటుంది' అని కేటీఆర్ సున్నితంగా హెచ్చరించారు. 'మాకు పోలీసుశాఖపై సానుభూతి ఉన్నది. మీకు నా విజ్ఞప్తి ఒక్కటే. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి మిమ్మల్ని అడ్డంపెట్టుకొని పబ్బం గడుపుకోవాలని అనుకుంటుండు. తన పదవిని కాపాడుకునేందుకు మిమ్మల్ని బద్నాం చేస్తుండు' అని అన్నారు. తిరుమలగిరి సంఘటన విషయంలో స్థానిక పోలీసులపై చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం చేసిన వారిపై 307 కేసు పెట్టాలని, కాంగ్రెస్ గూండాలను కచ్చితంగా అదుపులోకి తీసుకోవాలని డీజీపీని కోరినట్టు తెలిపారు. అలాగే కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడిచేసిన గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ లేకపోతే.. మిగతావారి పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని అన్నారు.

ఈ ముఖ్యమంత్రి మూర్ఖుడు

మంచిర్యాలలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, పోలీసులు వేధింపులు తట్టుకోలేక సత్యనారాయణ అనే

రైతుల కోసం ధర్నా చేస్తే దాడులా?: జగదీశ్‌రెడ్డి

9 నెలలుగా రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని, పోలీసులు కూడా రాజకీయ నాయకుల డైరెక్షన్‌లో పనిచేయిస్తున్నారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టానికి వ్యతిరేకంగా కిందిస్థాయి పోలీసులను వాడుకుంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా శాంతిభద్రతలు లేకుండా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కలిసే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థల సేవలకు సంబంధించి ఎవరైనా కాల్ చేస్తే.. వారినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

తిరుమలగిరి ఘటన 'వెరీ అన్-యాక్సెప్టబుల్'!

జర్నలిస్టులపై దాడి అంశంలో మీరు చెప్పగానే స్పందించాను ఇకపై ఏ సమస్య ఉన్నా నేరుగా చెప్పండి.. అడ్రస్ చేస్తా

కేటీఆర్ వినతులపై డీజీపీ సానుకూల స్పందన

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బీఆర్ఎస్ నేతలపై జరిగిన దాడులు అవాంఛనీయమని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేశామని, కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని చెప్పారు. శుక్రవారం డీజీపీ జితేందర్‌ను కేటీఆర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్, డీజీపీ మధ్య ఆసక్తికర సంభాషణ సాగిందని అక్కడున్నవారు పేర్కొన్నారు. 'సూర్యాపేటలో జరిగింది ఏమాత్రం కరెక్ట్ కాదు' అని కేటీఆర్ పేర్కొనగా.. 'మీతో ఏకీభవిస్తున్నాను. ఇట్స్ వెరీ అన్-యాక్సెప్టబుల్' అని డీజీపీ సమాధానం ఇచ్చారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మేము పరిపాలించినప్పుడు ఇలా చేశామా? ఇలా జరిగిందా? ఎప్పుడైనా పరిధి దాటి ప్రవర్తించామా? మంత్రిగా నేను కూడా హద్దులు తెలుసుకొని ప్రవర్తించాను కదా' అని కేటీఆర్ గుర్తు చేయగా.. 'అవును. మీరు తెచ్చిన సంస్కరణలే ఇప్పటికీ అమలవుతున్నాయి' అని డీజీపీ పేర్కొన్నట్టు తెలిసింది. 'మా సోషల్ మీడియా కార్యకర్తల మీద అడ్డగోలు కేసులు పెడుతున్నారు. మా హయాంలో మాపై చాలామంది తీవ్ర దుష్ప్రచారం చేశారు. అయినా ఎప్పుడూ కేసులు పెట్టలేదు. కేవలం సీఎం, ఇతర బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితేనే కేసులు పెట్టాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులపై దాడిని ప్రస్తావిస్తూ.. 'జర్నలిస్టులను కూడా కొడితే రాష్ట్రం ఏం కావాలి?' అని కేటీఆర్ ప్రశ్నించగా.. జరిగింది పొరపాటేనని డీజీపీ ఒప్పుకున్నారని తెలిసింది. 'మీరు ఫోన్ చేయగానే నేనే స్వయంగా ఇన్వాల్వ్ అయ్యాను. వాళ్లను ఎస్కార్ట్ ఇచ్చి హైదరాబాద్‌కు పంపాలని పోలీసులను ఆదేశించాను. ఘటనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించాను' అని డీజీపీ హామీ ఇచ్చినట్టు సమాచారం. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మీరు మా గొంతు నొక్కొద్దు' అని కేటీఆర్ కోరగా.. 'వందశాతం మీతో ఏకీభవిస్తాను. ఇకపై ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నాకే నేరుగా చెప్పండి. పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా' అని డీజీపీ చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

బీఆర్ఎస్ నాయకుడు ఆత్మహత్యాయత్నం చేశారని కేటీఆర్ తెలిపారు. అనేక చోట్ల పోలీసులను అడ్డంపెట్టుకొని వేధింపులు కొనసాగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో వ్యవస్థలను అడ్డంపెట్టుకొని బతుకుదామనుకుంటే ముఖ్యమంత్రంత మూర్ఖుడు మరొకడు ఉండడని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని, 30 రోజుల్లో 28 మర్డర్లు, ఈ నగరానికి ఏమైంది? అంటూ ముఖ్యమంత్రి అనుకూల పత్రికల్లోనే వార్తలు వస్తున్నాయని వివరించారు. వీటన్నింటినీ డీజీపీ దృష్టికి తీసుకొచ్చామని, వాటిపై స్పందించాలని డీజీపీని కోరామని వెల్లడించారు. అన్నీ పరిశీలిస్తామని డీజీపీకి చెప్పినట్టు కేటీఆర్ తెలిపారు.

ప్రతి చర్య ఉంటుంది

'సోషల్ మీడియాలో రుణమాఫీ కాలేదని పోస్టు చేసిన మా తమ్ముళ్ల మీద కేసులు పెడుతున్నారు. దాడులు చేస్తున్నారు. ఇక నుంచి మేము కూడా అదే పద్ధతిలో స్పందిస్తాం. చర్యకు ప్రతి చర్య ఉంటుందని డీజీపీకి చెప్పాం' అని కేటీఆర్ అన్నారు. 'పదేండ్లు శాంతియుతంగా రాష్ట్రాన్ని నడిపినం. 14 ఏండ్లు కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినొద్దని సంయమనంగా ఉన్నం. మా సహనాన్ని, మంచితనాన్ని, తెలంగాణపై ఉన్న ప్రేమను చేతగానితనంగా భావిస్తే.. చర్యకు ప్రతి చర్య తప్పదు' అని డీజీపీని, ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను మీడియాలో ప్రసారం చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది పోలీసులు మంత్రుల పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని డ్యాన్సులతో పరశించిపోతున్నారని, కేకులు కోస్తూ.. డ్యాన్స్‌లు చేస్తూ, స్పీచ్‌లు ఇస్తున్నారని డీజీపీ దృష్టికి తీసుకెళ్తే.. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, ఆర్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, ఎన్ భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, నోముల భగత్, నాయకులు దాసోజు శ్రవణ్, చిరుమల్ల రాకేశ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రావుల శ్రీధర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, ముఠా జయసింహా, పడాల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకోండి: టీయూడబ్ల్యూజే

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహిళా జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, కోశాధికారి పీ యోగానంద్, టెమ్జూ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, టెమ్జూ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యార నవీన్‌కుమార్ సంయుక్తంగా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భావప్రకటనా స్వేచ్ఛను హరించే వ్యక్తులు ఎంతటివారైనా సరే ఉపేక్షించవద్దని కోరారు. మహిళలు, విధి నిర్వహణలో ఉన్నారనే కనీస విచక్షణ లేకుండా దాడికి పాల్పడి, అసభ్యంగా ప్రవర్తించిన నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తమపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే నేత రమణకుమార్ ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదుచేస్తున్న మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి

ఆ గూండాలపై చర్యలు తీసుకోండి

- **జర్నలిస్టులకే రక్షణ లేకపోతే ఎలా?**
- **టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డీజీపీకి మహిళా జర్నలిస్టుల వినతి**

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తమపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బాధిత మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి శుక్రవారం డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టుకు వెళ్లిన తమపై కొందరు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నదని వివరించారు. రాష్ట్రంలో పత్రికాస్వేచ్ఛను కాపాడాలని కోరారు. స్పందించిన డీజీపీ ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బాధిత జర్నలిస్టులు మీడియాతో మాట్లాడుతూ మహిళలు ఇప్పుడిప్పుడే జర్నలిజంలోకి అడుగుపెడుతున్నారని, అలాంటి వారిపై సీఎం సొంత ఊరిలోనే దాడి జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణకుమార్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి యార నవీన్‌కుమార్, ఐజేయూ సభ్యుడు అవ్వారి భాస్కర్, న్యూస్‌లైన్ శంకర్, ప్రవీణ్, ప్రభాకర్, జర్నలిస్టు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి ఘటనపై నివేదిక ఇవ్వండి

నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి, వెల్దండ గ్రామాల్లో గురువారం ఇద్దరు మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర మహిళా కమిషన్ పోలీసులను ఆదేశించింది. బాధిత జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నాగర్ కర్నూల్ ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి నివేదిక అంచాలని ఆదేశించారు.

మహిళా జర్నలిస్టులపై ట్రోలింగ్

- **ఫోన్లు చేసి వేధింపులు**
- **గ్రూప్స్‌లో ఫోన్ నంబర్లు షేరింగ్**
- **సినిమా పాటలతో అసభ్యకరంగా మీమ్స్**
- **కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జే కీలకం**

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో గురువారం కాంగ్రెస్ మూకల చేతలో దాడికి గురైన మహిళా జర్నలిస్టులు ఆవుల సరిత, విజయారెడ్డిపై ట్రోలింగ్ మొదలైంది. వారిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నేతలు, ఆ పార్టీ అనుకూలురు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తెరతీశారు. ఫోన్లు చేసి వేధించేందుకు ప్రయత్నించారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల ద్వారా వేధింపులకు పాల్పడ్డారు. సరిత ఫోన్ నంబర్‌ను గ్రూపుల్లో పెట్టి ఫోన్లు చేయించారు. కొందరు మిస్డ్ కాల్స్ ఇస్తే, మరికొందరు ఫోన్లు చేసి తిట్టారు. ఇంకొందరు వాట్సాప్‌లలో మెసేజ్‌ల ద్వారా బెదిరించే ప్రయత్నం చేశారు. సరిత పాత ఫొటోలు, వివిధ సోషల్ మీడియా గ్రూపులను జల్లెడపట్టి మరీ వెతికి ఆమెపై బురదజల్లే ప్రయత్నం చేశారు. 2018లో ఆమె బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఒక గ్రూపునకు అడ్మిన్‌గా ఉన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నదంటూ రీల్స్, మీమ్స్ చేశారు. కొందరు కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా ప్రతినిధులు సరిత 'ఎక్స్'ఖాతాలో తిట్లదండకం మొదలుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి సరితను ట్రోల్ చేశారు. వరుసగా 4-5 ట్వీట్లు, రీట్వీట్లు చేశారు. సరిత ఫోన్ నంబర్‌ను కూడా సోషల్ మీడియాలో పెట్టారు. 'రేవంతన్న సైన్యం' 'అప్నా హస్తం' 'గీత అయినాల' 'తానోస్' 'మీ కాపలా కుక్క' 'లప్‌పాలిటిక్స్' తదితర పేర్లతోపాటు మరికొన్ని బినామీ పేర్లతో ఉన్న ఖాతాల నుంచి మరికొందరు సరిత, విజయపై ట్రోల్స్ చేశారు.

ప్రత్యేక వీడియోలు

విజయారెడ్డి, సరిత వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారిని మానసికంగా వేధించేలా కొన్ని వీడియోలు రూపొందించారు. అన్యమత ప్రచారానికి వెళ్లినందునే కొండారెడ్డిపల్లి గ్రామస్థులు వెళ్లగొట్టారని కామెంట్లు పెట్టారు. తమపై సినిమా పాటలతో కొన్ని వీడియోలు చేశారని, వేధింపులంటూ సరిత, విజయారెడ్డి ఆవేదన వ్యక్తం చేసినా ట్రోలింగ్‌లు ఆగలేదు. పైగా కొండారెడ్డిపల్లికి వచ్చి రేవంతన్నతో పెట్టుకుంటే ఇలాగే అవుతుందంటూ ఫోన్లు చేసి వేధించారు. తనపై జరుగుతున్న ట్రోలింగ్‌ను డీజీపీ జితేందర్ దృష్టికి సరిత తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి సామా రామ్మోహన్‌రెడ్డి తన పేరు, తన ఫోన్ నంబర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారని ఫిర్యాదు చేశారు. డీజీపీ, సైబర్ క్రైం పోలీసులు తక్షణం దీనిపై స్పందించాలని, తగిన చర్య తీసుకోవాలని ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు.

నిందితులపై చర్యలు తీసుకుంటాం

జర్నలిస్టులకు మహిళా కమిషన్ హామీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టు కోసం నాగర్‌కర్నూలు జిల్లాలోని సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్లిన జర్నలిస్టులపై గురువారం కాంగ్రెస్ మూకలు దాడిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం జర్నలిస్టు సంఘాలతో కలిసి బాధిత జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి హైదరాబాద్‌లోని మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రిపోర్టింగ్‌కు వెళ్లిన తమపై కొందరు గూండాల్లా వ్యవహరించి దాడిచేశారని, అసభ్యకరంగా ప్రవర్తించారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి దారుణ పరిస్థితిని తాము గతంలో ఎక్కడా చూడలేదని అన్నారు. స్పందించిన కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు ఏ రమణకుమార్ ఉన్నారు.

మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదు

- **సీఎం రేవంత్ వర్గీయులు చేసింది తప్పే**
- **చర్చించుకుంటున్న కొండారెడ్డిపల్లి వాసులు**

వంగూరు, ఆగస్టు 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదని గ్రామస్థులు అంటున్నారు. ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ ఎందరికి వర్తించిందో తెలుసుకునేందుకు వచ్చిన జర్నలిస్టులపై అత్యంత దారుణంగా అల్లరిమూకలు దాడి చేసిన విషయం విదితమే. శుక్రవారం ఈ విషయమై గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరిగినట్టు తెలిసింది. దాడి మంచిదికాదని పలువురు రైతులు చర్చించుకున్నారు. 'అవును రుణమాఫీ చాలామంది రైతులకు కాలేదనేది వాస్తవం.. అది తెలుసుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం మంచిది కాదు. గ్రామం పేరు చెడగొట్టారు.. అవసరమైతే మరుసటి రోజు కాంగ్రెస్ నాయకులు విలేకరులను పిలిచి వాదన చెప్పాల్సింది.. కానీ వారిపై దాడి చేయడం ఏ మాత్రం సరికాదు.. ప్రశాంతంగా ఉన్న ఊరికి రాష్ట్రస్థాయిలో చెడ్డ పేరు తెచ్చారు' అని మాట్లాడుకున్నట్టు తెలిసింది.

రేవంత్ పాలనలో మహిళలకు రక్షణ కరువు

మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 23: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి హామీలను నెరవేర్చలేక అసమర్థ పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. అదిచాలదన్నట్టు రౌడీలను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ అమలుకాక రాష్ట్రమంతా రైతులు రోడ్లపైకి వస్తుంటే సీఎం స్వగ్రామంలో పరిస్థితి ఎలా ఉందోనని మహిళా జర్నలిస్టులు విధి నిర్వహణలో భాగంగా కవరేజీ కోసం వెళ్తే కాంగ్రెస్ గూండాలతో దాడి చేయించడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదనడానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో చెంచు మహిళలపై జరిగిన లైంగికదాడి ఘటనపైనా మహిళా మంత్రుల స్పందన కరువైందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు.

లోకం పోకడ

నిద్రలో నడిచే అలవాటు కాదు వదినా.. బ్యాంకు ముందు క్యూలో వెనకబడకుండా రాత్రే బయలుదేరి వెళ్తున్నాడు!

సర్కారు వద్ద సమాచారం లేదట!

ఏది అడిగినా అదే సమాధానం

ఆర్టీఐ దరఖాస్తునూ పట్టించుకోరు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో పారదర్శకత లోపించింది. ప్రభుత్వాన్ని ఆర్టీఐ ద్వారా ఏ సమాచారం అడిగినా 'లేదు' అనే సమాధానం వస్తున్నది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, వాటికి కేటాయించిన నిధులపై కూడా సమాచారాన్ని దాచిపెడుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పథకాల ప్రచారానికి, ప్రభుత్వ ప్రచారానికి ఎన్ని నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అంటే సమాధానం లేదు. పాలనాపగ్గాలు చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు హస్తినకు 20 సార్లు వెళ్లారు. ఒక్కసారి సీఎం బృందం ఢిల్లీ పర్యటనకు ఎంతవుతున్నది? ఇప్పటివరకు ఎంతయింది? అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మౌనమే సమాధానం. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకొనే అధికారం సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కల్పించింది. కానీ, ఆర్టీఐ కింద దరఖా